క్లుప్తంగా

ఎరువుల దుకాణాలకు ఈ పాస్ మిషన్లు



ఈపాస్ మిషన్లు అందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

సిరిసిల్లటౌన్: జిల్లాలోని ఐదు మహిళా సంఘాల ఎరువుల దుకాణాలకు ఈ పాస్ మిషన్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పంపిణీ చేశారు. ఇందిరా మహిళాశక్తి కింద జిల్లాలోని పలు మహిళా సంఘాల బాధ్యులకు ఇటీవల పురుగు మందులు, ఎరువుల దుకాణాల పత్రాలు అందజేయగా, సోమవారం మహాలక్ష్మి గ్రామైక్య సంఘం ఫెర్టిలైజర్స్ అండ్ విత్తనాలు (పెద్దూర్), శ్రీ ధనలక్ష్మి మండల సమాఖ్య ఫెర్టిలైజర్స్ అండ్ విత్తనాలు వేములవాడ, శివరామ్ గ్రామైక్య సంఘం ఫెర్టిలైజర్స్ అండ్ విత్తనాలు వేములవాడ మండలం బొల్లారం, విలాసాగర్ గ్రామైక్య సంఘం ఫెర్టిలైజర్స్ అండ్ విత్తనాలు బోయినపల్లి, వెన్నెల గ్రామ సమాఖ్య సంఘం రుద్రంగికి యంత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, వేములవాడ ఇన్చార్జి ఆర్డీవో రాధాబాయి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను నియమించాలి

సిరిసిల్లటౌన్: మున్సిపల్ కమిషనర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో పురపాలన స్తంభిస్తుందని పట్టణ పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. బల్దియా ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు పాలనాపరమైన వ్యవహారాలన్నిటికీ ఆటంకాలు ఏర్పడినట్లు తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవ తీసుకొని పూర్తిస్థాయిలో కమిషనర్ నియమించాలని కోరారు. ఇక్కడ ఉపాధ్యక్షుడు చీకోటి అనిల్‌కుమార్, సహాయ కార్యదర్శి గణేష్, కోశాధికారి చిప్ప దేవదాస్, సభ్యులు నల్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



వీర్నపల్లి: మండలంలోని కంచర్ల వడ్డెర కాలనీ, బంజేరు, మద్దిమల్ల గ్రామాల్లో వైద్య సిబ్బంది సోమవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. పలువురికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా మలేరియా వైద్యాధికారి అనిత, ఎల్లారెడ్డిపేట సీహెచ్‌సీ డాక్టర్ సరియా అంజుమ్, జిల్లా మలేరియా హెచ్‌సీవో లింగం, వైద్యసిబ్బంది మోహన్, రాజుకుమార్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు ఉన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలలో సోమవారం శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో కలశస్థాపన, స్వామివారికి అభిషేకం, హోమం పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి



రుద్రంగి: ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రుద్రంగి నాయకులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ, ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందించారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, నాయకులు గంగం మహేశ్, దయ్యాల కమలాకర్, చెప్యాల గణేశ్, ఉప్పులూటి గణేశ్, రవి, నారాయణ, ద్యావల సత్తయ్య, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

ముస్తాబాద్: రైతులకు యాభైశాతం రాయితీపై జీలుగు విత్తనాలు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి దుర్గరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్తాబాద్‌లోని మండల సమాఖ్యకేంద్రం, ఆవునూర్ ఐకేపీ కేంద్రంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు.

వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

తంగళ్లపల్లి: వేసవిలో ఎండల తీవ్రత, వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సాంస్కృతిక సారథి కళాకారులు అన్నారు. సోమవారం మండలంలోని రాళ్లపేటలో కళాజాత నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

వృథాగా 'భగీరథ' నీరు

- తరచూ పైపులైన్ల లీకేజీతో వృథాగా వెళ్తున్న నీరు
- నాణ్యతా లోపంతోనే పగులుతున్న పైపులు
- పట్టించుకోని అధికారులు
- వేసవిలో తాగునీటికి ప్రజల తిప్పలు



ఈ చిత్రం ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని పాతబస్టాండ్ ప్రాంతంలోనిది. పైపులైన్ లీకేజీతో మిషన్ భగీరథ నీరు రోడ్డు వెంట వృథాగా పోతోంది. వేసవిలో నీరంతా రోడ్ల వెంట వృథా కావడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క మండల కేంద్రంలోనే కాకుండా అల్మాస్‌పూర్‌లోనూ పైపులైన్లు లీకేజీ అవుతూ..నీరు వృథాగా పోతున్నాయి. ఐదు రోజుల వ్యవధిలో రెండుసార్లు పైపులైన్లు లీకయ్యాయి. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని 24 గ్రామాల్లో 2015లో అప్పటి ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా పైపులైన్లు వేసి నల్లాల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తోంది. గతంలో పైపులైన్లు వేస్తున్న సమయంలో నాసిరకంగా పైపులు వేయడంతో ఇప్పుడు తరచూ పగులుతున్నాయి.

శాఖల మధ్య సమన్వయ లోపం..

మిషన్ భగీరథ, సెస్ అధికారుల మధ్య సమన్వయ లోపంతో విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సమస్యలతో భగీరథ పైపులు లీకేజీ, పగిలిపోవడం లాంటివి జరుగుతున్నాయి. ముస్తాబాద్, గంభీరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాలకు విద్యుత్ ద్వారానే భగీరథ నీటిని అందిస్తున్నారు. అయితే పైపులైన్లు నాణ్యతతో కూడినవి కాకపోవడం ఒకటైతే, పైపుల్లో సామర్థ్యానికి మించి నీరు చేరడంతో తరచూ ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. రెండు శాఖల మధ్య సమాచారం లోపంతోనే సమస్యలు వస్తున్నాయి. తాగునీటి కోసం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురిస్తోంది.

వ్యాపారులు, వాహనదారుల ఇబ్బంది

మిషన్ భగీరథ పైపులైన్లు లీకేజీతో మండలకేంద్రంలో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. పాత బస్టాండ్‌లో లీకేజీ నీరు పెద్దఎత్తున బయటకు రావడంతో వ్యాపార సముదాయాల్లోకి వెళ్తున్నాయి. సిరిసిల్ల– కామారెడ్డి ప్రధాన రహదారిపై భారీగా నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినా ఆలస్యం కావడంతో ఇబ్బంది తప్పడం లేదు. ఇప్పటికైనా భగీరథ అధికారులు పైపులైన్లు లీకేజీలు, పగిలిపోకుండా చూడాలని, ప్రజలకు వేసవిలో తాగునీటిని క్రమం తప్పకుండా అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మిషన్ భగీరథ పైపులైన్లు లీకేజీ కావడంతో కిరాణా దుకాణాల్లోకి నీరు చేరుతోంది. పాత బస్టాండ్‌లో వృథా నీరు భారీగా రావడంతో దుకాణాల్లోకి కస్టమర్లు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఐదు రోజుల్లో రెండు సార్లు పైపులు లీకేజీ అయి నీరంతా రోడ్డుపై చేరింది. వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు.

– గాండ్ల సత్యనారాయణ, కిరాణ వ్యాపారి

చర్యలు తీసుకుంటాం

సెస్ అధికారులు చెట్లను కొట్టే క్రమంలో తమకు సమాచారం ఇవ్వకుండా పైపుల్లో సామర్థ్యానికి మించి నీరు చేరడంతో లీకేజీ, పైపులు పగులుతున్నాయి. ఈ విషయంపై సెస్ అధికారులతో మాట్లాడాం. ఇక ఇలాంటి సమస్య తలెత్తకుండా చూస్తాం. వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటాం.

– ప్రశాంత్, భగీరథ ఏఈఈ, ఎల్లారెడ్డిపేట

ఇందిరమ్మ లబ్ధిదారుడిపై కాంగ్రెస్ నాయకుడి దాడి

- కాలితో తన్ని వాగ్వాదం
- ముగ్గు పోసేందుకు పిలువలేదని ఆగ్రహం
- పరస్పరం ఫిర్యాదు.. ఇద్దరిపై కేసు



శ్రీనివాస్‌గౌడ్‌ను తంతున్న కాంగ్రెస్ నాయకుడు కిషన్

తంగళ్లపల్లి: ఇందిరమ్మ ఇంటి ముగ్గు పోసే కార్యక్రమానికి తనను పిలువలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓ కాంగ్రెస్ నాయకుడు లబ్ధిదారుడిని కాలితో తన్నడం సంచలనంగా మారింది. ఈ సంఘటన తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలో శనివారం రాత్రి జరుగగా.. ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు. రాళ్లపేటను రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకంలో పైలట్ గ్రామంగా ఎంపిక చేసింది. గ్రామానికి చెందిన బాలుసాని రేణుక–శ్రీనివాస్‌గౌడ్ దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఈనెల 1వ తేదీన ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసుకున్నారు. ఈ కార్యక్రమానికి బంధువులను, గ్రామస్తులను ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గనాది కిషన్‌తో గతంలో వివాదం ఉండడంతో ఆహ్వానించలేదు. కోపోద్రిక్తుడైన కిషన్ బూతులు తిట్టడంతోపాటు బిల్లులు ఎలా వస్తాయో చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ విషయమై గ్రామంలో ఈనెల 5న పంచాయితీ పెట్టడంతో గ్రామపెద్దలు ఇద్దరిని సముదాయించారు. దీన్ని మనసులో పెట్టుకొని శనివారం రాత్రి గ్రామంలోని బెల్టుషాపు వద్ద శ్రీనివాస్‌గౌడ్ గ్రామస్తులతో మద్యం సేవిస్తుండగా.. కిషన్ వెనుక నుంచి వచ్చి కాలితో తన్ని వాగ్వాదానికి దిగాడు. ఈ దృశ్యం అక్కడి సీసీ కెమెరాలలో రికార్డుకావడంతో వైరల్‌గా మారింది. గనాది కిషన్‌ను 'సాక్షి' వివరణ కోరగా శ్రీనివాస్‌గౌడ్‌తో తమకు పాతకక్షలు ఉన్నాయని ఇందిరమ్మ ఇంటి విషయంలో గొడవ జరగలేదని స్పష్టం చేశారు. మద్యం సేవిస్తున్న క్రమంలోనే మాటమాట పెరిగి గొడవకు దారితీయడంతో కాలితో తన్నినట్లు తెలిపారు. తంగళ్లపల్లి ట్రెయినీ ఎస్సై కె.వినీతారెడ్డి మాట్లాడుతూ ఇద్దరు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారని.. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన అక్షయ్

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేట గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని మరిమడ్లకు చెందిన జింక అక్షయ్, కొండం రిషి ద్విచక్రవాహనంపై వేములవాడకు వెళ్తున్నారు. బావుసాయిపేట గ్రామ శివారులో టాటాఏస్ వాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వేములవాడలోని ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు.

ఆటో, కారు ఢీ..

రుద్రంగి: మండలకేంద్రంలోని కోరుట్ల, వేములవాడ ప్రధాన రహదారిలో ట్రాలీ ఆటో, కారు ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి నుంచి వేములవాడ వైపు వెళుతున్న కారు రోడ్డుపై నిలపడంతో వెనకనుంచి వచ్చిన ట్రాలీ ఆటో ఢీకొట్టింది. కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది.

సంక్షిప్త వార్తలు

● ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలి

ఎల్లారెడ్డిపేట: కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని వెంటనే తూకం వేసి, కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని ఐకేజీ డీపీఎం పద్మయ్య అన్నారు. మండలంలోని వెంకటాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. కేంద్రంలో కొనుగోలు వివరాలు, ట్యాబ్ ఎంట్రీలో రైతుల నమోదు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏపీఎం మల్లేశం, సీసీ పద్మ, వీఓఏ రేఖ, వీవో అధ్యక్షులు ఉన్నారు.

● ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం

గంభీరావుపేట: మండలంలోని కోళ్లమద్దిలో నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామి వారి కల్యాణోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

● రెండిళ్లలో చోరీకి యత్నం

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో రెండిళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. గ్రామానికి చెందిన వంగపెల్లి పర్శరాములు, వంగపెల్లి సత్తవ్వ ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. సోమవారం ఉదయం వచ్చేసరికి తాళాలు పగులగొట్టి బీరువా తెరిచి ఉన్నాయి. దీంతో వెంటనే కోనరావుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విచారణ జరిపారు.

● రాజన్న భక్తుడికి ఫిట్స్

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన ఓ భక్తుడికి ఫిట్స్ రావడంతో సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. ఆలయంలోకి చేరుకున్న తర్వాత దర్శనికి వెళ్తున్న క్రమంలో ఫిట్స్ వచ్చింది. వెంటనే అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్, పోలీసు సిబ్బంది, భక్తులు సపర్యలు చేసి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అక్కడి నుంచి ఆస్పత్రికి తరలించారు.

● చర్యలు తీసుకోవాలి

కోనరావుపేట: ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, జిల్లా కౌన్సిల్ మెంబర్ గొట్టె రామచంద్రం, నోముల భాస్కర్‌రెడ్డి, దూర్ల శంకర్, యశోద రాజు, దడిగె గంగయ్య, మోతుకు మోహన్, పాలకుర్తి శ్రీనివాస్, జలేందర్, వేణు తదితరులు ఉన్నారు.

● పైపులైన్ తవ్వకాలపై ఫిర్యాదు

ముస్తాబాద్: మండలంలోని మద్దికుంట నుంచి చీకోడు వరకు రహదారిపై చేపట్టిన తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని చీకోడు నాయకులు కొండల్‌రెడ్డి, పడిగె అంజనేయులు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కోరారు. అనుమతులు లేకుండా రోడ్డుకు ఒకవైపు జేసీబీతో పైపులైన్ తీస్తున్నారన్నారు. తీసిన మట్టిని రోడ్డుపై వేయడంతో రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతుందన్నారు. పంచాయతీరాజ్‌శాఖ అనుమతులు పొందకుండానే పనులు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు.

మద్యం ధరల పెంపు సరికాదు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం మద్యం ధరలు పెంచడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సోమవారం పట్టణంలోని కార్మిక భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మద్యం ధరలు పెంచి ప్రభుత్వ ఖజానా నింపుకోవాలనుకోవడం సిగ్గుచేటన్నారు. మద్యం ధర పెంచి మధ్య తరగతి ప్రజల జేబులకు చిల్లులు పడేలా చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఈసడించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు పంతం రవి, మీసలక్ష్మణ్, అజ్జ వేణు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు అందించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మధ్యాహ్న భోజనం, ఉపాధిహామీ కార్మికులకు సకాలంలో వేతనాలు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మంద సుదర్శన్, మీసం లక్ష్మణ్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10వేలు ఇస్తామన్న హామీ ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. ఉపాధిహామీ పనులు సరిగ్గా అమలు చేయడం లేదన్నారు. భవిష్యత్ పోరాటాల కోసం నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల కన్వీనర్‌గా సత్తవ్వ, నర్సవ్వ, మణెమ్మలను ఎన్నుకున్నట్లు తెలిపారు. నర్సవ్వ, రోజా, లక్ష్మి, జ్యోతి, కళావతి, బాలరాజు, శంకర్, ఆనంద్, బాలయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

31న బాల కథా సమ్మేళనం

సిరిసిల్లకల్చరల్: ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 31న బాల కథా సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు పరిషత్ తెలంగాణ ప్రచార కార్యదర్శి డాక్టర్ వాసరవేని పరశురాములు ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్య అధ్యయనంతో బాలల్లో వికాసం మెరుగుపడుతుందన్నారు. సినారె శిష్యుడు గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాల సాహితీవేత్తలు ముకుందం భూపాల్, డీకే చదువుల బాబు, కె. వెంకట రమణయ్య, కాశీ విశ్వనాథం, పుల్లా రామాంజనేయులు, వేంకటేశ్వర్లు, డాక్టర్ కే. రాంప్రసాద్ సమ్మేళనానికి హాజరుకానున్నట్లు తెలిపారు. ఔత్సాహిక బాలలు తమ కథలను ఈనెల 30లోపు పంపించాలన్నారు. పర్యావరణం, నీతి కథలు, ప్రకృతి, దేశభక్తి కథలు, సమాజ హితం కోరేవి, సందేశాత్మక, హాస్య కథలు పంపించవచ్చన్నారు. 94948 51349 లేదా 92909 00879 నెంబర్లలో వాట్సాప్ ద్వారా, మెసేజ్ రూపంలో పంపించాలన్నారు.

నివాళి

వేములవాడ అర్బన్/ముస్తాబాద్/కోనరావుపేట/బోయినపల్లి/వీర్నపల్లి: కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇక్కడ సీపీఎం నాయకులు, తదితరులున్నారు.



వేములవాడ అర్బన్: సీఐటీయూ కార్యాలయంలో చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు కనీస నిర్వహణపై ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రాజెక్టు పరిసరాల్లో కుడి, ఎడమ ప్రధాన కాలువల వద్ద, ఇతర చోట్ల ప్రాజెక్టు వివరాలను తెలిపే నేమింగ్ బోర్డులను పట్టించుకోవడం లేదు. ఎక్కడ చూసినా బోర్డులు తుప్పుపట్టిపోయాయి. వివరాలు ఏమాత్రం కనిపించడం లేదు. అధికారులు స్పందించి ప్రాజెక్టు వివరాలను తెలిపే బోర్డులపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
నర్సింగ్, ఇరిగేషన్ డీఈ : 9490170079

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

దివ్యాంగుల పునరావాసానికి ఆర్థికసాయం

- రూ.50వేల చొప్పున చెక్కులు పంపిణీ



కలెక్టరేట్‌లో దివ్యాంగుడికి ఆర్థికసాయం చెక్కు అందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

సిరిసిల్ల: జిల్లాలోని 18 మంది దివ్యాంగుల పునరావాసానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ కలెక్టరేట్‌లో సోమవారం ఆర్థికసాయం చెక్కులను అందించారు. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో దివ్యాంగుల ఆర్థిక సహాయ పునరావాస పథకంలో జిల్లాకు 18 యూనిట్లు మంజూరయ్యాయి. రెండు ప్రత్యేక యూనిట్లు మంజూరు చేశారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన గుండ్లపల్లి రేణుక, ముస్తాబాద్‌కు చెందిన భూక్య రజిత, ఎల్లారెడ్డిపేటకు చెందిన రాజశేఖర్, కుంటా వెంకటేశ్, గంభీరావుపేట చెందిన మాలోత్ పేర్యా, వీర్నపల్లికి చెందిన ముగులోజు వంశీకృష్ణ, ఎల్లారెడ్డిపేటకు చెందిన ఏనుగుల మహేందర్‌లకు రూ.50వేల పూర్తి సబ్సిడీతో నాన్ బ్యాంకింగ్ చెక్కులను కలెక్టర్ అందించారు. వేములవాడ ఆర్డీవో రాధాబాయి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



విప్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో శ్రీ మడేలేశ్వర్ స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విప్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్, సామ తిరుపతిరెడ్డి, వంగపల్లి మల్లేశం, ఎల్లగౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషిచేయాలి



విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సన్మానం

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, రెడ్డి ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు మోతే దేవిరెడ్డి అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్, ఈఏపెసెట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన మండలంలోని రెడ్డి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సోమవారం ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెడ్డి విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక గురుకులాలు, హాస్టల్ సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రేపా సభ్యులు, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడపల్లిలో వృద్ధ దంపతులపై దాడి

- హోటల్ సామగ్రి ధ్వంసం
- కోడలి బంగారం కాజేశారంటూ దాడి



ధ్వంసమైన హోటల్ సామగ్రి

చందుర్తి: మండలంలోని మూడపల్లిలో ఓ వృద్ధ దంపతులపై గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం దాడి చేశారు. స్థానికులు తెలిపిన వివరాలు. మూడపల్లికి చెందిన నీరటి అమృతవ్వ– మల్లయ్య దంపతులు జీవనోపాధి కోసం గ్రామంలో హోటల్ నిర్వహిస్తున్నారు. వీరి కుమారుడికి ఏడు నెలల క్రితం వేములవాడఅర్బన్ మండలం అగ్రహారం అనుబంధ ఇందిరానగర్‌కాలనీకి చెందిన యువతితో వివాహమైంది. కాగా కోడలు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటుంది. దీంతో తల్లిదండ్రులు కుమారుడు, కోడలు ఒకే చోట కలిసి ఉండాలని సూచించారు. కుమారుడు ఈ విషయాన్ని అత్తింటి వారికి చెప్పగా.. వారు అల్లుడి తల్లిదండ్రులు తమ కూతురు బంగారాన్ని కాజేశారని గ్రామంలో పంచాయితీ పెట్టారు. ఈక్రమంలోనే సోమవారం నంబర్ ప్లేట్ లేని కారు, బైక్‌లపై వచ్చిన కొందరు ఆ వృద్ధ దంపతులపై దాడి చేశారు. హోటల్ సామగ్రిని ధ్వంసం చేశారు. దాడి ఘటనలో ఆరుగురిపై అనుమానాలు ఉన్నాయని, విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని చందుర్తి ఎస్సై అంజయ్య తెలిపారు.

ఆధార్ లింక్ చేసుకోండి

సిరిసిల్ల కల్చరల్: ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగులైన పోస్ట్ మెట్రిక్ విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ కార్డు లింక్ చేసుకోవాలని జిల్లా ఎస్సీడీవో బి. రాజమనోహర్‌రావు తెలిపారు. గతేడాది (2024–25) వివిధ కోర్సులు అధ్యయనం చేసిన వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోలేని ఫ్రెష్, రెన్యువల్ విద్యార్థులు ఈ నెల 31 లోపు తమ దరఖాస్తులను నమోదు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ దరఖాస్తులను వెంటనే జిల్లా అధికారి లాగిన్‌లోకి పంపించాలని విద్యాసంస్థల నిర్వాహకులకు సూచించారు.

విజయవంతం చేయాలి

రుద్రంగి: హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాని బీజేపీ మండల అధ్యక్షుడు కర్ణవత్తుల వేణు కోరారు. సోమవారం ఆయన మండల బీజేపీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈనెల 22న కేంద్రమంత్రి బండి సంజయ్ చేపట్టిన హిందూ ఏక్తా యాత్ర తరలిరావాలన్నారు.